క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక



రఘునాథపల్లి : ఫతేషాపూర్ గ్రామంలో ఆదివారం ముదిరాజ్ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెండెల తిరుపతి, ఉపాధ్యక్షుడిగా జెట్టబోయిన లక్ష్మయ్య, కార్యదర్శిగా చింత కాయల లక్ష్మయ్యను ఎన్నుకున్నారు.

సబ్సిడీ వరి విత్తనాలను వినియోగించుకోవాలి



జఫర్‌గఢ్ : సబ్సిడీ ద్వారా అందజేస్తున్న వరి విత్తనాలను రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కరుణాకర్‌రెడ్డి కోరారు. ఆదివారం జఫర్‌గఢ్‌లో వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులకు సబ్సిడీ ద్వారా వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. వానాకాలంలో వరి పంటను సాగు చేసేందుకు 50 శాతం సబ్సిడీతో సన్నరకం ఆర్‌ఎన్‌ఆర్–15048, కేఎన్‌ఎం–1638 రకాలకు చెందిన వరి విత్తనాలను రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. రైతులు వెంటనే సబ్సిడీ విత్తనాల కోసం వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ప్రశాంత్, సురేందర్, మాజీ ఎంపీటీసీ ఎడ్ల వెంకటస్వామితో పాటు రైతులు పాల్గొన్నారు.

దేవాదుల నీటితో చెరువులు నింపాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జనగామ రూరల్ : దేవాదుల ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలోని చెరువులు, కుంటలను నింపి పొలాలకు సాగునీరు అందించే విధంగా కృషి చేయాలని సీపీఎం నాయకులు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని కోరారు. హైదరాబాదులో ఆదివారం ఎమ్మెల్యే రాజేశ్వర్ రెడ్డిని సీపీఎం నాయకులు పరామర్శించారు. మండలంలోని గానుగుపహాడ్ వాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించి వినతి పత్రం అదజేశారు. జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, సాంబరాజు యాదగిరి, బూడిద గోపి, జోగు ప్రకాష్, సుంచు విజేందర్ ఉన్నారు.

అభివృద్ధి పనులకు అప్పులు

ఆర్థికభారంతో ఇబ్బందులు
- గ్రామ పంచాయతీ కార్యదర్శులపై అదనపు పనిభారం
- అన్ని శాఖల బాధ్యతలు వారిపైనే..



చిల్పూరు గ్రామ పంచాయతీ కార్యాలయం

చిల్పూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామాల్లో చేపట్టాల్సిన పనులకు నిధులు రావడం లేదు. దీంతో పల్లెల్లో అభివృద్ధి పనులు చేసేందుకు అప్పులు చేయాల్సి వస్తోందని జీపీల కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే అభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శులు పనిభారంతో సతమతమవుతున్నారు. అన్ని శాఖల పనులు వీరే నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గతంలో వీఆర్‌ఏ, వీఆర్వోలను రద్దు చేయడంతో పనుల భారం వీరి నెత్తిన పడింది. మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా 14 మంది కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన అనంతరం 16 నెలలుగా పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రావడం లేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ప్రత్యేక నిధులు రాకపోవడంతో పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులు మాత్రం లక్ష్యాలను నిర్దేశిస్తూ గడువులోగా పనులు పూర్తి చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శులకు ఆర్థికభారం, పని ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నారు.

ఇతర శాఖల పనులు వీరికే అప్పగింత

కార్యదర్శులు తమ రోజువారి విధులతో పాటు ఇతర శాఖల పనులు చేయాల్సి వస్తోంది. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక, మరుగుదొడ్లు, వ్యవసాయ శాఖ సర్వేలపై సైతం వారికే అప్పగించారు. వీటితో పాటు ఇటీవల విద్యాశాఖకు సంబంధించి మరికొన్ని పనులు కట్టబెట్టారు. ఇప్పటికే మౌలిక వసతుల కల్పన, పరిశుభ్రత తదితర పనులు నిర్వహించాల్సి వస్తోంది. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ సంబంధించిన విచారణ బాధ్యతలు గతంలో వీఆర్వోలు నిర్వహించే వారు. ప్రస్తుతం వారు లేకపోవడం, గ్రామాల్లో వివాహాలను రిజిస్టర్ చేయడం, సంబంధిత ధ్రువపత్రాల జారీ వంటి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక నిధులు కేటాయించాలి

వర్షాకాలం సీజన్ కావడంతో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిధుల కొరతతో ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. దీంతో అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం పంచాయతీలకు కేటాయించిన ట్రాక్టర్లకు డీజిల్ పోయించడానికి పెట్రోల్ బంకుల్లో అదనంగా అప్పు చేసి ట్రాక్టర్లను నడిపిస్తున్నారు. పనిభారం తగ్గించడంతో పాటు వర్షాలు మొదలైనందున ప్రత్యేక నిధులు కేటాయించాలని పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు.

‘స్థానిక’ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



లింగాలఘణపురం: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

లింగాలఘణపురం : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్‌ఎస్ నాయకులు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య కోరారు. ఆదివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 30 వరకు స్థానిక సంస్థల రిజర్వేషన్లు ప్రకటించే అవకాశం ఉన్న నేపథ్యంలో కార్యకర్తలంతా ఐక్యంగా ఉండి అన్ని స్థానాలను గెలుచుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని, సీఎం రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పడమే తప్ప చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలన.. రైతులకు రాక్షస పాలనగా మారిందని, సీఎం విసిరిన సవాల్‌కు కేటీఆర్ 72 గంటల సమయంలో చర్చకు సిద్ధమా అని ప్రకటిస్తే వెంటనే ఢిల్లీకి వెళ్లారని విమర్శించారు. బీఆర్‌ఎస్ పాలనలోనే రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని తెలిపారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసు, నాయకులు చేవెళ్లి సంపత్, ఉపేందర్‌రెడ్డి, శేఖర్, భాస్కర్‌రెడ్డి, వీరయ్య, గండి యాదగిరి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ ఆశయాలను సాధించాలి

స్టేషన్‌ఘన్‌పూర్ : దళితులు, బహుజనుల సంక్షేమానికి కృషి చేసిన డాక్టర్ జగ్జీవన్‌రామ్ ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పేర్కొన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి రాజయ్య హాజరయ్యారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు కనకం గణేష్, మారెపల్లి ప్రసాద్, గుర్రం శంకర్, గుర్రం చిట్టిబాబు, బంగ్లా శ్రీనివాస్, గుండె మల్లేష్, చింత శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలి’

దేవరుప్పుల : హామీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం చిన్నమడూరులో బీఆర్‌ఎస్ పార్టీ క్లస్టర్ సమావేశం నిర్వహించారు.బీఆర్‌ఎస్‌కు పూర్వవైభవం తెచ్చేందుకు పార్టీ శ్రేణులు పాటుపడాలని సూచించారు. మండల అధ్యక్షుడు తీగల ద యాకర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు సంతోష్, హన్మం తు, వంగ వెంకటేశ్వర్లు, మల్లికార్జున్, జోగేశ్వర్, అ ర్జున్‌గౌడ్, కృష్ణమూర్తి, నర్సింహ్మస్వామి పాల్గొన్నారు.

ఘనంగా శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి



పాలకుర్తి టౌన్ : శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



బచ్చన్నపేట: నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పాలకుర్తి టౌన్ : జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భగా ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ మండల అధ్యక్షుడు మారం రవికుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు కమ్మగాని శ్రీకాంత్, దుంపల సంపత్, పెనుగొండ సోమేశ్వర్, వేల్పుల దేవరాజ్, సంతోష్, బచ్చు శ్రీనివాస్, శంకర్‌నాయక్, కరుణాకర్, శివ, శ్రీనివాస్,చేతన్ ,దేవస్ పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట : జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బంగారు మహేష్, ఉపాధ్యక్షుడు రాపెల్లి చక్రపాణి, బేజాడి సిద్దులు, దొంతుల చంద్రమౌళి, కక్కెర్ల గణేష్, రాంబాబు, చంద్రం, భాస్కర్, మహేష్, బాబు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

పాలకుర్తి : ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆలిండియా కిసాన్ సంఘటన్ రాష్ట్ర కార్యదర్శి మాన్యపు బుజేందర్ ఆదివారం కోరారు. దేశవ్యాప్త సమ్మెకు అందరూ సహకరించాలన్నారు.

11న మున్సిపల్ ఎదుట మహాధర్నా..



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కల్యాణి తదితరులు

జనగామ రూరల్ : స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 11వ తేదీన మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు పందిళ్ల కల్యాణి కోరారు. ఆదివారం పట్టణంలోని బాణాపురంలో అధ్యయన యాత్ర కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థానిక ప్రజా సమస్యలపై 30 వార్డుల్లో సీపీఎం ఆధ్వర్యంలో అధ్యయన సర్వే చేపడుతున్నామన్నారు. పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ మారుమూల గ్రామాల్లో కూడా లేని దారుణమైన స్థితి ఉందన్నారు. ధరావత్ మహేందర్, బిట్ల లక్ష్మి, ఎర్ర అనిత, తాటి వసంత, గుగ్గిళ్ల పద్మ, నాగిళ్ల విజయ సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట : మండల కేంద్రానికి చెందిన కర్రె సాయిలు మృతి చెందగా కుటుంబ సభ్యులకు స ర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు గంగం స తీష్‌రెడ్డి ఆదివారం రూ.5వేల నగదు అందించారు.

చిల్పూరు : లింగంపల్లి గ్రామానికి చెందిన గౌడుగు సంపత్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

లింగాలఘణపురం : మండలంలోని కుందారం గ్రామంలో ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక చేర్యాల, తొర్రూరు, భువనగిరి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతను ఇంటింటి ప్రచారం చేశారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

జనగామ : పట్టణానికి చెందిన రాపోలు రాజశేఖర్, సోని జన్మదినం సందర్భంగా రాజరాజేశ్వరి అనాథ వృద్ధాశ్రమంలో పవన్ కళ్యాణ్ హెల్పింగ్ పీపుల్స్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం చేశారు.

గురు పూజోత్సవం

దేవరుప్పుల : తొలి ఏకాదశి పండుగ సందర్భంగా మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. దేవరుప్పుల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఆర్‌ఎస్‌ఎస్ జనగామ శాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు.

రేపు బీఆర్‌ఎస్ మండల విస్తృత స్థాయి సమావేశం

చిల్పూరు : బీఆర్‌ఎస్ పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం మండల కేంద్రంలో రేపు (మంగళవారం) నిర్వహించనున్నట్లు మండల ఇన్‌చార్జ్ మాలోత్ రమేశ్ నాయక్ ఆదివారం తెలిపారు.

పనులు త్వరగా పూర్తి చేస్తాం..

జనగామ రూరల్ : జనగామ మండలం గానుగుపహాడ్–హుస్నాబాద్–జనగామ హైవేపై బ్రిడ్జి నిర్మాణ పనులు గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే జాప్యం జరిగిందని మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక

సంక్షిప్త సమాచారం

శివరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వేములవాడలో భక్త మండలి భజనలు

బచ్చన్నపేట : మండలంలోని బండనాగారం గ్రామానికి చెందిన శ్రీరామలింగేశ్వర స్వామి భజన మండలి వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భజనలు చేశారు. ఆదివారం తొలి ఏకాదశిని పురస్కరించుకొని ఆలయంలో మండలి అధ్యక్షుడు జంగిలి ఆంజనేయులు నేతృత్వంలో భజనలు చేశారు. పెసరు ధర్మయ్య, మల్లారెడ్డి, నారాయణ, కిష్టయ్య, పార్వతమ్మ, పద్మ, జ్యోతి, అరుణ, భాగ్యలక్ష్మి, రామకృష్ణ, పాల్గొన్నారు.

భూమి పూజ

బచ్చన్నపేట : మండలంలోని కొడవటూర్ సిద్ధేశ్వరాలయ దేవస్థాన స్వాగత తోరణ నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రం నుంచి చేర్యాలకు వెళ్లే రోడ్డులో పాత ఆలయ కమాన్ వద్ద నూతన తోరణం నిర్మాణానికి ముగ్గు పోశారు. సిద్దిపేటకు చెందిన దాతలు వల్లాద్రి చందన, రమణారెడ్డి, అజిత్‌రెడ్డి, అనురాగ్‌రెడ్డిలు రూ.10.50 లక్షల వ్యయంతో స్వాగత తోరణంను అలాగే శివలింగాన్ని నిర్మిస్తున్నారని అన్నారు.

విరాళం

నర్మెట : మండలంలోని హన్మంతాపూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రేణుకా ఎల్లమ్మ తల్లి గుడి నిర్మాణానికి ముదిరాజ్ సంఘం సభ్యులు ఆదివారం రూ.20వేల విరాళాన్ని అందించారు. గౌడ, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అంకూస్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు

జఫర్‌గఢ్ : మండలంలోని సబ్ పోస్టాఫీసులో పనిచేస్తున్న ఎండీ అంకూస్ వరంగల్ హెడ్ పోస్టాఫీసు డివిజన్ స్థాయి ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్నారు. ఉత్తమ సేవలు అందించినందుకు గాను డివిజన్ స్థాయిలో అవార్డు అందుకున్న అంకూస్‌ను సబ్ పోస్టాఫీసు పోస్టు మాస్టర్‌తో పాటు సిబ్బంది అభినందనలు తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

స్టేషన్‌ఘన్‌పూర్ : డివిజన్ కేంద్రానికి చెందిన బోసు శివాంజలి బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు స్టేషన్ ఘన్‌పూర్ జెడ్పీఎస్‌ఎస్ హెచ్‌ఎం ఎం.సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. శివాంజలి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడంపై తల్లిదండ్రులతోపాటు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండు బైకులు ఢీ.. ఒకరికి గాయాలు

బచ్చన్నపేట : ఎదురెదురుగా వస్తున్న బైకులు ఢీకొని ఒకరికి గాయాలైన సంఘటన ఆదివారం మండల కేంద్రంలో జరిగింది. పెద్దపహాడ్ గ్రామానికి చెందిన మహేష్ తన భార్య, కూతురుతో కలిసి కొన్నె గ్రామానికి వెళ్తున్నాడు. బచ్చన్నపేట దాటిన తర్వాత సదాశివపేట రోడ్డు నుంచి అకస్మాత్తుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో మహేష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. 108 వాహనంలో జనగామ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



అనిల్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్ : బైక్ కొనివ్వలేదని మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని తాటికొండలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బట్టమేకల చేరాలు, రాజమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు అనిల్(20) సంతానం. చేరాలు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో అనిల్ ఇటీవల తనకు కొత్త బైక్ కొనివ్వాలని కోరగా తల్లిదండ్రులు నిరాకరించారు. దీంతో మనస్తాపానికి గురైన అనిల్ క్షణికావేశంతో గత నెల 20వ తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. దీంతో ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



జనగామ: బతుకమ్మకుంట విజయ దుర్గామాత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



చిల్పూరు: పత్తి అలంకరణలో స్వామివారు



జనగామ: దీపాల కాంతుల్లో పాండురంగ స్వామి



జనగామ: బీరప్ప ఆలయంలో..



నర్మెట: దుర్గామాతకు పూజలు చేస్తున్న చైర్మన్ అంజయ్య దంపతులు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

సాక్షి నెట్‌వర్క్ : తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకుని జిల్లాలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పాలకుర్తి శ్రీ సోమేశ్వరాలయం, బచ్చన్నపేట కొడవటూరు సిద్దులగుట్ట, చిల్పూరు శ్రీ వెంకటేశ్వరాలయం, జీడికల్ శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు జరిగాయి. భక్తులు భక్తి విశ్వాసాలతో భగవంతుడిని ప్రార్థించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, ప్రకృతి వైపరీత్యాలు రాకుండా కరుణించాలని వేడుకున్నారు. బాణాపురం శ్రీ వెంకటే శ్వరస్వామి ఆలయంలో బంగారు తాపడంతో తయారు చేసిన రథంపై స్వామి కొలువు దీరారు. దేవతామూర్తులను తలుచుకుంటూ భక్తులు ఉపవాస దీక్షలతో తమలోని భక్తిని ఇనుమడింప జేశారు. విష్ణుమూర్తికి తులసీ మాలలతో అలంకరించారు. పలువురు భక్తులు రావిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు.



జనగామ: పూజలో పాల్గొన్న మహిళలు



చిల్పూరు: ప్రసాద వితరణలో ఈఓ లక్ష్మిప్రసన్న



చిల్పూరు: బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



స్టేషన్‌ఘన్‌పూర్: తిరుమలనాథ స్వామి ఆలయంలో..



జనగామ: ఉమామహేశ్వరస్వామి ఆలయంలో..



రఘునాథపల్లి: పూజలో పాల్గొన్న భక్తులు

ఊరూరా పీరీల సందడి



జఫర్‌గఢ్: కూనూర్‌లో పీరీల వద్ద భక్తులు



పాలకుర్తి టౌన్: శూర్పణఖ వేషధారణలో కొండయ్య



దేవరుప్పులలో..

జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ముస్లింలు, హిందువులు మొహర్రం వేడుకలను ఆదివారం జరుపుకున్నారు. తొమ్మిది రోజుల అనంతరం దూలే దూలేరా కాసీమా.. అంటూ డప్పుచప్పుళ్లతో పీరీలను(షావర్ల) ఊరేగింపు చేపట్టారు. ఆట,పాటల నడుమ ప్రదర్శన నిర్వహించారు. పీరీలకు అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రజలు మొక్కులు సమర్పించారు. ఊరేగింపు అనంతరం పీరీలను రాత్రి బావిలో నిమజ్జనం చేయడంతో పండుగ ముగిసింది. ముస్లింలు, హిందువులతో పాటు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



లింగాలఘణపురం: పీరీలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు, గ్రామస్తులు



స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లిలో..



బచ్చన్నపేట: కట్కూర్‌లో..



జఫర్‌గఢ్‌లో..

ఎమ్మార్పీఎస్ జెండా పండుగ నిర్వహించాలి



జఫర్‌గఢ్ : ఎస్సీ వర్గీకరణ సాధించినందుకు గాను ఎమ్మార్పీఎస్ జెండా పండుగను గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు రడపాక అదాం, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు ఇల్లందుల రాంబాబు కోరారు. మండలంలోని కూనూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ గద్దె నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో ఎన్నో పోరాటాల ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధించడం జరిగిందన్నారు. వర్గీకరణ ద్వారా మాదిగలకు అన్ని విధాలా న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఇల్లందుల రాజు, ఏలియా, బాబు, దాట్ల అశోక్, అనిల్, మరెయ్య, దాట్ల యాకయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.